క్లుప్తంగా

స్విమ్మింగ్ పోటీలకు ఎస్ఎస్ అండ్ ఎన్ విద్యార్థి



నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి ఎస్.జగదీష్ 37వ జాతీయ క్రీడలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదన రావు గురువారం తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన స్విమ్మింగ్ ఎంపిక పోటీలలో జగదీష్ మూడు రజిత, ఒక కాంస్య పతకం సాధించి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. అక్టోబర్ 29వతేదీ నుంచి నవంబరు 4వతేదీ వరకు గోవా రాష్ట్రంలోని పన్‌జిమ్ అక్వాటిక్ సెంటర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలలో జగదీష్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. కళాశాల పాలక వర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయ కుమార్, నాగసరవు సుబ్బరాయగుప్త, అధ్యాపకులు అభినందించారు.

ఖోఖో పోటీలకు కృష్ణవేణి విద్యార్థిని



అలేఖ్య

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి మహిళా ఖోఖో పోటీలకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థిని బి.అలేఖ్య ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూలో ఈనెల 27న ఖేలో ఇండియా రాష్ట్ర మహిళా ఖోఖో జట్టు ఎంపిక పోటీలలో తమ విద్యార్థిని అలేఖ్య అండర్–18 విభాగం జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరిలోని సెయింట్ జాన్‌బాస్కో బాలికల ఉన్నత పాఠశాలలో అక్టోబరు 6వ తేదీ నుంచి 8వతేదీ వరకు జరగనున్న ఖేలో ఇండియా సౌత్‌జోన్ మహిళా ఖోఖో పోటీలలో అలేఖ్య ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. అలేఖ్యను కళాశాల డైరెక్టర్ కె.నాసరయ్య, ప్రిన్సిపల్ నాతాని, వ్యాయామ అధ్యాపకుడు ఈదర ఆదిబాబు, అధ్యాపకులు అభినందించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



నాదెండ్ల: భవ్యశ్రీపై అత్యాచారం జరిపి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు అద్దంకి బాబుమాదిగ చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్లలో గురువారం ఎమ్మార్పీస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన నిర్వహించారు. ముందుగా ఎస్సీ కాలనీలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడి నుండి వడ్డెరకాలనీ, ఎస్సీ కాలనీ వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

రూ.లక్షలు పలికిన గణనాథుడి లడ్డూ

ఉత్సాహంగా దక్కించుకున్న భక్తులు



రొంపిచర్లలోని లడ్డూ ప్రసాదాలతో గొట్టం మస్తానమ్మ, మార్త కోటయ్య



వేల్పూరులో స్వామివారి లడ్డూను దక్కించుకున్న సాదినేని వేణు



వి.రెడ్డిపాలెంలో లడ్డూ ప్రసాదంతో మున్నంగి వెంకటేష్



పేరూరుపాడులో లడ్డు కైవశం చేసుకున్న ఆళ్ళ గోపాలరావు కుటుంబ సభ్యులు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం కళామందిరం సెంటరులో గణనాధుడు నిమజ్జనం వేడుకలు గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి విగ్రహాన్ని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ దంపతులు వితరణ చేశారు. స్వామివారి లడ్డూను గ్రామానికి చెందిన సాదినేని వేణుబాబు లక్ష 10 వేల రూపాయలకు దక్కించుకున్నారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత 22 సంవత్సరాల నుంచి గణనాధుడి వేడుకలు గ్రామస్తుల సహకారంతో పార్టీలకు అతీతంగా వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు.

పూజారి మారుతీశర్మ సారథ్యంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సమయంలో దంపతులచే ప్రత్యేక పూజలు భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు వివిధ సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే 5 వేల మందికి భారీ అన్నదానం కూడా ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తనయుడు బొల్లా గిరిబాబు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, తదితరులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాల్గొన్నారు. శాంతి భద్రతలను ఎస్సై తిరుపతిరావు తన సిబ్బందితో పర్యవేక్షణ చేశారు.

రొంపిచర్ల మండలంలో..

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం, రొంపిచర్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుని పందిట్లోని లడ్డూ ప్రసాదాలకు గురువారం రాత్రి వేలం నిర్వహించారు. రొంపిచర్ల బ్యాంక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి పందిట్లోని 11 కేజీల లడ్డూ ప్రసాదాన్ని గొట్టం మస్తానమ్మ రూ.1.01,116లకు పాడుకోగా, 9 కేజీల లడ్డూ ప్రసాదాన్ని మార్త కోటయ్య రూ.52 వేలకు పాడుకున్నారు. అలాగే వి.రెడ్డిపాలెం గ్రామంలో వినాయకుని ఆలయంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద లడ్డూ ప్రసాదాన్ని ఆ గ్రామానికి చెందిన మున్నంగి వెంకటేష్ రూ.1 లక్ష రూపాయలకు పాడుకున్నారు. ఈ విగ్రహాలకు నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు.

బొల్లాపల్లి మండలంలో...

బొల్లాపల్లి: మండలంలో వినాయక చవితి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలు నిమజ్జనానికి తరలి వెళ్లాయి. పేరూరుపాడు గ్రామంలో పోలీస్‌బజార్‌లో ఏర్పాటు చేసిన గణనాథుని లడ్డు ధర రూ.30,500లకు ఆళ్ళ గోపాలరావు వేలం పాటులో దక్కించుకున్నాడు. అనంతరం గణేషుడు నిమజ్జనానికి తరలించారు. వెల్లటూరు గ్రామంలో ముతరాసుబజార్‌లో గణేష్ విగ్రహం ఊరేగింపుగా నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ కీర్తిని జాషువా జగద్విఖ్యాతం చేశారు

గుర్రం జాషువా జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



వినుకొండలో జాషువా విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మక్కెన



చిలకలూరిపేటలో జాషువా విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

వినుకొండ (నూజెండ్ల): మహాకవి గుర్రం జాషువా 128వ జయంతి వేడుకలు వినుకొండలో ఘనంగా గురువారం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జున రావులు జాషువా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం జాషువా కళాప్రాంగణం ప్రాంగణంలో ఉన్న కాంస్య విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ వినుకొండ కీర్తి ప్రతిష్టలు ప్రపంచానికి తెలియజేసిన మహాకవి గుర్రం జాషువా వినుకొండ వాసి కావటం అందరి అదృష్టమన్నారు. తమ ప్రభుత్వ హయాంలో గుర్రం జాషువా కాంస్య విగ్రహం ఏర్పాటు చేశామని త్వరలో జాషువా పేరుమీద ఆడిటోరియం నిర్మిస్తామన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జాషువా ఆశయాలకు అనుగుణంగా పరిపాలన కొనసాగిస్తున్నారని, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం అండగా ఉంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జాషువా కవితలు సామాజిక చైతన్య వీచికలు

చిలకలూరిపేట: సామాజిక చైతన్యానికి మహాకవి గుర్రం జాషువా కవితలు ఎంతగానో దోహదపడ్డాయని సామాజిక సామరస్యతా వేదిక జిల్లా అధ్యక్షుడు అడపా రవిబాబు చెప్పారు. సామాజిక సామరస్యతా వేదిక ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతిని గురువారం నిర్వహించారు. ముందుగా పట్టణంలోని శాఖా గ్రంథాలయం సమీపంలో ఉన్న గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాహిత్యంలో జాషువాను మించిన వారు లేరని కొనియాడారు. ఆయన కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని మూఢాచారాలపై ఉద్యమించారని చెప్పారు.

తన జీవిత కాలంలో ఎన్నో బిరుదులు, పురస్కారాలు అందుకున్న మహాకవి అని కొనియాడారు. తిరుపతి వెంకట కవులలో ఒకరైన చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి స్వయంగా జాషువా కాలికి గండపెండేరం తొడిగి ఈ కవీశ్వరుని పాదం తాకి తన జన్మ ధన్యమైందని చెప్పడం జాషువా గొప్పతనానికి నిదర్శనంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో వేదిక నాయకులు శ్యాంమోహన్ రావు, రాము, శ్రీనివాసరావు, సుధాకర్, నాగార్జున, సుబ్బారావు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

భగత్‌సింగ్ జయంతి సందర్భంగా సీఐటీయూ కార్యాలయంలో రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న వారితో ముఖ్య అతిథులు, నాయకులు

నరసరావుపేట: రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణం కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత వరకు రక్తదానం చేయాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు వెల్లడించారు. సర్దార్ భగత్‌సింగ్ 116వ జయంతి సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న సీఐటీయూ కార్యాలయంలో పల్నాడు బ్లడ్ సెంటర్ పర్యవేక్షణలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రభుత్వ వైద్యులు డాక్టర్ పామరాజు వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్ఎఫ్ఐ గౌరవాధ్యక్షుడు ఎ.లక్ష్మీశ్వర రెడ్డి ప్రారంభించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ షహీద్ భగత్‌సింగ్ చిన్న వయసులోనే భారతదేశం స్వతంత్రం కోసం పోరాడి ఉయ్యాల ఊగిన యువ నాయకుడని, నేటి తరం విద్యార్థిని, విద్యార్థులు యువకులు కామ్రేడ్ భగత్‌సింగ్ ఆశయ సాధన కోసం ఆయన అడుగుజాడల్లో నడవాలని పేర్కొన్నారు. మరొకరి జీవితానికి వెలుగును ఇవ్వండి, రక్తదానం చేయండి, ప్రాణదాతలుకండి.. అంటూ పలు నినాదాలు చేశారు. శిబిరంలో విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజా సంఘాలు, వామపక్ష నాయకులు, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు రక్తదానం చేశారు. జిల్లా సీఐటీయూ సహాయ కార్యదర్శి సిలార్ మసూద్, సమైక్యా ఆంధ్రప్రదేశ్ ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఎస్‌కె జిలాని మాలిక్, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయ రాజు, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జడ రాజ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిద్ధూ, పల్నాడు బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ ఎం.శ్రీనివాస్, జిల్లా డీవైఎఫ్ఐ నాయకులు షేక్ సుభాని, ఎస్ఎఫ్ఐ చిలకలూరిపేట డివిజన్ ప్రెసిడెంట్ జి.రాజేష్, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కళాశాల అభ్యున్నతికి పూర్వ విద్యార్థుల విరాళం

వినుకొండ (నూజెండ్ల): పట్టణంలోని గంగినేని కల్యాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి 1993–96 విద్యా సంవత్సరం చదివిన పూర్వ విద్యార్థులు రూ. లక్ష రూపాయల విరాళాన్ని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరిబాబు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తాము చదువుకున్న కళాశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎం.భాస్కరరెడ్డి, ఆంజనేయులు, పి.రమేష్, జె.రమేష్, మధుమోహన్, శివనాగరాజు, వెంకటరెడ్డి, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులను చెల్లించండి

నరసరావుపేట: విద్యుత్ బిల్లులను వెంటనే చెల్లించి తగిన రసీదులు పొందాలని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.ఏడుకొండలు గురువారం ప్రజలను కోరారు. ప్రస్తుత బిల్లుతో పాటు పాత బిల్లులు ఏవైనా పెండింగ్‌లో ఉంటే చెల్లించాలని సూచించారు. లేనిపక్షంలో వినియోగదారుడికి ముందస్తు నోటీసు నిమిత్తం లేకుండానే విద్యుత్ సర్వీసు తొలగించటం జరుగుతుందని హెచ్చరించారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

వినుకొండ (నూజెండ్ల): పేద బడుగు బలహీన వర్గాల ఆదుకునేందుకు సీఎంవై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎం సహాయ నిధి ద్వారా అందిస్తున్న పరిహారాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఉప్పలపాడు గ్రామానికి చెందిన కొత్త తేజస్వీనికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 3 లక్షల 80 వేల చెక్కును అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖ్జునరావు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్‌నబి వేడుకలు



పసుమర్రులో చినమసీదు వీధిలో ప్రార్థనలకు హాజరైన ముస్లిం కుటుంబాలు



పసుమర్రులో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

చిలకలూరిపేటటౌన్: మండలంలోని పసుమర్రు గ్రామం చిన మసీదు వీధిలో గురువారం మిలాద్ ఉన్ నబీ వేడుకల్ని స్థానిక ముస్లింలు భక్తి శ్రద్ధలతో చేశారు. గత ఐదేళ్ల కాలంగా ప్రతి సంవత్సరం మిలాద్ ఉన్ నబీ రోజున వీధి ప్రజలంతా సమిష్టిగా ఈ వేడుకల్ని నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం నుంచి మొహమ్మద్ ప్రవక్త (సఅసం) స్మరిస్తూ ఆధ్యాత్మిక గీతాలను ఆలపిస్తారు. అనంతరం భారీగా అన్నదాన కార్యక్రమం చేస్తారు. ఆయా కార్యక్రమాలను అక్కడి పెద్దలు షేక్ మస్తాన్ షరీఫ్–నసీమా, అబ్దుల్ రౌఫ్–గౌసియా, అబ్దుల్ రవూఫ్–మెహెర్, ఫర్మానుల్లా– సానియా, అమానుల్లా – సపూర దంపతుల ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాల్ని నిర్వహించారు.

వినుకొండలో..

వినుకొండ(నూజెండ్ల): ప్రపంచ మానవాళికి ఆదర్శమైన జీవితాన్ని ప్రసాదించిన దైవమూర్తి మహమ్మద్ ప్రవక్త అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. గురువారం మిలాద్ ఉన్ నబి పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త బోధనలతో మానవాళికి ఆదర్శ ధార్మిక జీవితాన్ని ప్రసాదించారని ఆయన కొనియాడారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: సమాజంలో దురాచారాలను పెకిలించి, సమస్త మానవాళిని సన్మార్గం వైపు నడిపిన మహమ్మద్ ప్రవక్త బోధనలు సర్వ మానవులకు ఆచరణీయమని మౌలానా అబ్దుల్ రహమాన్ చెప్పారు. మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని మీలాద్ ఉన్ నబి పర్వదినాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అరేబియా దేశంలో 1400 ఏళ్ల క్రితం జన్మించిన మహమ్మద్ ప్రవక్త గొప్ప సంఘ సంస్కరణలు చేశారన్నారు. నాటి సమాజంలో దురాచారాలు, దౌర్జన్యాలను నిర్మూలించి సదాచారాలను నెలకొల్పారన్నారు. మనుషులంతా సమానమేనని, ఏ ఒక్కరిపై మరొకరికి ఏరకంగానూ ఆధిపత్యం లేదని, అందరి భగవంతుడు ఒక్కడేనని చాటారన్నారు.

ఏరియా వైద్యశాలకు ల్యాబ్ మిషనరీ అందజేత

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాల ల్యాబ్‌లో అవసరమైన సెంటర్ఫ్యుగ్ అనే రూ. 22 వేలు విలువ చేసే పరికరాన్ని హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్తా రామకృష్ణ గురువారం వైద్యశాలకు అందించారు. రోగులకు సకాలంలో ల్యాబ్ టెస్టులు చేయాలంటే ఇప్పుడున్న ఒక పరికరం సరిపోవడం లేదని ల్యాబ్ ఉద్యోగులు తన దృష్టికి తీసుకు రావడంతో వెంటనే స్పందించి ఎన్‌కే ఫిట్నెస్ జిమ్ వారిని సంప్రదించగా కొంత మొత్తం అందించారని మిగిలిన నగదు తాను వేసుకున్నట్లు తెలిపారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి. లక్ష్మణరావు, నాగు, కిరణ్, వైద్యశాల ల్యాబ్ సిబ్బంది అలీ, రామకృష్ణ, చందు ఉన్నారు.

ఘనంగా షిర్డీసాయి బాబా జన్మదిన వేడుకలు



సామూహిక సాయిసత్యవ్రతాల్లో పాల్గొన్న భక్తులు

నాదెండ్ల: చిలకలూరిపేట నూతన మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం స్వామివారి 188వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురుదేవులు అమ్ముల సాంబశివరావు సూచనల మేరకు ఉదయం 5 గంటలకు బాబా వారి కాగడ హారతి, 6 గంటలకు సుప్రభాత సేవ, 7 గంటలకు అభిషేకాలు జరిపారు. 8.30 గంటల నుండి మధ్యాహ్నం వరకూ సామూహిక సాయిసత్యవ్రతాలు, విరాటసాయి స్తోత్రం నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు యూవీ శివరామయ్య, కార్యదర్శి సీహెచ్ పాపారావు, సాయి సేవక్ సామ్రాజ్యం పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను విజయవంతం చేయండి

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పిడుగురాళ్ల: యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ నాయకులు రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలో స్వర్ణోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో యూటీఎఫ్ ఎప్పుడూ ముందుంటుందని ఆయన తెలియజేశారు. యూటీఎఫ్ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీ నిర్వహించి విజయోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబర్ 1వ తేదీన విజయవాడలోని సిద్ధార్థ కాలేజీలో నిర్వహించనున్న స్వర్ణోత్సవ వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ముందుగా పట్టణంలో యూటీఎఫ్ పతాక ఆవిష్కరణ సీనియర్ నాయకులు ఎం.నాగయ్య చేతుల మీదుగా జరిగింది. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మెజి శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జి.విజయసారథి, కార్యవర్గ సభ్యులు ఎస్‌కే జమాల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.కాశీం ఫీరా, మాచవరం, దుర్గి, కారెంపూడి, దాచేపల్లి, గురజాల, రెంటచింతల మండలాల యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

సామాజిక వ్యవస్థ కోసం పాటుపడిన లక్ష్మారెడ్డి

సంస్మరణ సభ పోస్టర్ ఆవిష్కరించిన ప్రజాసంఘాల నాయకులు



పోస్టరును విడుదల చేస్తున్న నాయకులు

నరసరావుపేట: జీవితాంతం సామాజిక వ్యవస్థ కోసం పరితపించిన వ్యక్తి ఎస్.లక్ష్మారెడ్డి అంటూ ప్రజాసంఘాల నాయకులు కొనియాడారు. ఈనెల 30వ తేదీన గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే పౌరహక్కుల సంఘ నాయకుడు లక్ష్మారెడ్డి సంస్మరణ సభను ఉద్దేశించిన గోడపత్రికను గురువారం మార్కెట్ యార్డు ఆవరణలో ఆవిష్కరించారు.

రాష్ట్ర పీడీఎం నాయకులు వై.వి.వెంకటేశ్వర్లు, పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి శికినం చిన్న మాట్లాడుతూ హక్కుల సంఘం అంటేనే సాహసిక ప్రయాణమన్నారు. ఆ సందర్భంలో జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన లక్ష్మారెడ్డి సామాజిక జీవితం నేటి యువతకు అవసరమన్నారు. ఆ స్ఫూర్తిని అలవర్చుకొని కొనసాగించాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. తాను నమ్మిన ఆచరించిన విశ్వాసాలను అనుగుణంగా దేశవ్యాప్తంగా అప్రకటిత ఎమర్జెన్సీని తలపిస్తున్న ఎన్ఐఏ అక్రమ అరెస్టులు, ఆదివాసులపై దాడులు, చట్ట బద్ధపాలనపై బీజేపీ భావజాలాన్ని ప్రతిబింబించే మణిపూర్ సంఘటనలపై సీఎల్పీ నిజ నిర్ధారణ రిపోర్టుపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న సనాతన ధర్మంపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సును ఏర్పాటు చేస్తున్నామన్నారు. జై భీమ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షులు గోదా జాన్‌పాల్, ఎంఐఎం పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ దర్యావలి, పీడీఎం జిల్లా నాయకులు రామకృష్ణ, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

వినుకొండ ఫొటోగ్రాఫర్లకు పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న వంగపల్లి బ్రహ్మం



వంగపల్లి బ్రహ్మం తీసిన మెట్ల బావి ఫొటో



అవార్డు అందుకుంటున్న కేసనపల్లి సుబ్బారావు



కేసనపల్లి తీసిన జ్యోతి ప్రజ్వలన ఫొటో

వినుకొండ (నూజెండ్ల): ప్రపంచ పర్యటక దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంస్కృతిక శాఖ, ఫొటోగ్రఫీ అకాడమీ ఇంటర్ నేషనల్ ఇండియా ఫొటోగ్రఫీ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో వినుకొండకు చెందిన ఇద్దరు ఫొటోగ్రాఫర్లు తమసత్తా చూపి గోల్డ్ మెడల్‌తో పాటు అవార్డులను అందుకున్నారు. విజయవాడలోని బాలోత్సవ భవనంలో జరిగిన కార్యక్రమంలో వినుకొండ ఫొటోగ్రాఫర్లు వంగపల్లి బ్రహ్మం, కేసనపల్లి సుబ్బారావులు ఉత్తమ ప్రతిభ రాష్ట్ర కల్చరల్ సెక్రటరి ఎం.ఇంతిరాజ్ (ఐఏఎస్) చేతులమీదుగా పురస్కారాలు అవార్డులు అందుకున్నారు. ఫొటోగ్రాఫర్ వంగపల్లి బ్రహ్మం తీసిన ప్రకాశం జిల్లా అటవీ ప్రాంతంలోని పురాతన మెట్ల బావికి, ఫొటోగ్రాఫర్ కేసనపల్లి సుబ్బారావు వినుకొండ పట్టణం కొండపై తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా అఖండ జ్యోతి చిత్రానికి అవార్డులు రాష్ట్రస్థాయిలో అందుకున్నారు. ఫొటోగ్రాఫర్లు కంచర్ల సుబ్బారావు, మద్దికుంట మోహన్, కంచి శ్రీనివాసరావు, వడ్రాణం నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.